క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

ధారూరు: చివరి సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ జైదుపల్లి విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటలకు జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని ఆమె కోరారు.

అమావాస్య పూలంగి సేవ



మూలమూర్తి

కొడంగల్: పట్టణంలోని బాలాజీనగర్‌లో వెలసిన పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం అమావాస్య పూలంగి సేవ నిర్వహించారు. అర్చకులు స్వామి మూలమూర్తిని పలు రకాల పూలతో అందంగా అలంకరించారు. వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా నిత్య పూజలు, కైంకర్యాలు, విశేష పూజలు, అర్చనలు చేశారు. పూలంగి సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

రసీదు తప్పనిసరి

మర్పల్లి: రసీదులు ఇవ్వకుండా విత్తనాలు, ఎరువులను విక్రయించరాదని ఏఈఓ నీరజ డీలర్లను ఆదేశించారు. గురువారం మండల పరిధి బూచన్‌పల్లిలో ఫెస్టిసైడ్, ఫర్టిలైజర్ దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్, రైతుల వివరాల నమోదు వివరాలతో పాటు విత్తన సంచులను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విత్తనాలు విక్రయించాలని, స్టాక్ వివరాలు, ధరల పట్టికను ప్రదర్శించాలని సూచించారు. రైతులకు విత్తనాలు విక్రయించిన వెంటనే వారికి రసీదు ఇవ్వాలని దుకాణ దారులకు సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఆమె డీలర్లను హెచ్చరించారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

బొంరాస్‌పేట: పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, అన్ని రంగాల్లో దూసుకుపోవాలని పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ సూచించారు. గురువారం మండల కేంద్రంలో ఎస్‌ఎస్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్ వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు జయకృష్ణ సర్టిఫికెట్లు అందజేశారు. 45 రోజులుగా నిర్వహించిన శిబిరంలో ఎంఎస్ ఆఫీస్, డీసీఏ, పీజీడీసీఏ, డీటీపీ, ఫొటోషాప్, టాలీ, పేయింటింగ్ తదితర కంప్యూటర్ కోర్సులు నిర్వహించగా.. సుమారు 50మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో ప్రతిభ చూపారు. ఇందులో ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు సుధాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింలు గౌడ్ ఉన్నారు.


హరితహారానికి ఏర్పాట్లు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

కుల్కచర్ల: హరితహారం కార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వానాకాలం నేపథ్యంలో గ్రామాల్లో మొక్కలు నాటేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు కావాల్సిన మొక్కలను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖరీం, ఏపీఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో విద్యార్థులు

మొయినాబాద్: మండల పరిధిలోని బాకారం జాగీర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2005-06 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన బాల్య మిత్రులు మొయినాబాద్‌లోని ఓ వ్యవసాయక్షేత్రంలో గురువారం సందడి చేశారు. పద్దెనిమిదేళ్ల క్రితం ఒకే పాఠశాలలో చదివిన వారందరూ మళ్లీ ఒకచోట చేరి సందడి చేశారు. నాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ.. కేరింతలు కొట్టారు. ప్రస్తుత పరిస్థితుల గురించి చర్చించుకొని, యోగక్షేమాలు తెలుసుకున్నారు. రోజంతా మిత్రులతో ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సర్కారు బడి.. సరికొత్త ఒరవడి

- ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన, సౌకర్యాలు
- ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు
- మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపండి
- 'బడిబాట'లో ఉపాధ్యాయులు



పూడూరు: సోమన్‌గుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు తదితరులు

యాలాల: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను స్థానిక సర్కారు బడుల్లో చేర్పించాలని మండల విద్యాధికారి సుధాకర్‌రెడ్డి సూచించారు. గురువారం మండల పరిధి విశ్వనాథ్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో జయశంకర్ బడిబాటను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బడిబయట పిల్లలతో పాటు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో బడుల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, రెండు జతల యూనిఫాంలు, ఉచిత పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు అందజేస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు. ఐదు సంవత్సరాలు పైబడిన పిల్లలను పాఠశాలలో చేర్పించాలన్నారు. అంతకుముందు బడిబాట ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఇందోలు శ్రీధర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ వనమాల, పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య, బుక్ కీపర్ వెంకట్, ఉపాధ్యాయురాలు సంతోష తదితరులు ఉన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచండి..

బంట్వారం: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ చంద్రప్ప అన్నారు. బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో బడిబాట కార్యక్రమాన్ని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ర్యాలీ తీశారు. అనంతరం మాట్లాడారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయబృందానికి సూచించారు. ఈ నెల 19 వరకు బడిబాట కొనసాగుతుందని, ఇంటింటికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రైవేటు బడులకు మాన్పించి సర్కారు బడుల్లో చేర్పించి, విద్యార్థుల సంఖ్య పెంచడని సూచించారు. హెచ్‌ఎంలు శ్రీనివాస్, వెంకటరత్నం, రాంచంద్రయ్య, జ్యోతి, సీఆర్పీ నర్సింలు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, మహిళా సమాఖ్య అధ్యక్షుడు తదితరులు ఉన్నారు.

అందరి భాగ్యస్వామ్యంతో..

పెద్దేముల్: ప్రతి ఒక్కరి భాగ్య స్వామ్యంతో పది రోజుల పాటు జరగనున్న బడిబాటను విజయవంతం చేయాలని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ కోరారు. కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యను బోధిస్తున్నామని, తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ ఎంలు శ్రీనివాస్, అక్కమదేవి, ఉపాధ్యాయులు నర్సిరెడ్డి, షైమాద, వెంకటలక్ష్మి, సంగీత, నషీజ్‌సుల్తానా, రాదా పాల్గొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ బడులను బలోపేతం చేస్తున్నామని మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులతో ఆయన సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యతతో కూడిన బోధనతో పాటు, పిల్లలకు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. ఇదే విషయాన్ని బడిబాటలో ప్రజలకు వివరించి, వారి పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించేందుకు కృషి చేయాలని సూచించారు.

పాఠ్యపుస్తకాలు వచ్చాయి..

దౌల్తాబాద్: ప్రభుత్వ పాఠశాలల పాఠ్యపుస్తకాలు గురువారం ఎంఆర్‌సీ కార్యాలయానికి వచ్చాయని ఎంఈఓ వెంకటయ్య తెలిపారు. 1నుంచి 10వ తరగతికి చెందిన విద్యార్థులకు 18,500 బుక్స్ వచ్చాయని, ఇంకా 4,500 రావాల్సి ఉందని చెప్పారు.

ఆదర్శ పనుల్లో నాణ్యత తప్పనిసరి

తాండూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని ఎంఈఓ వెంకటయ్య అన్నారు. మండల పరిధి ఎల్మకన్నె ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న మరుగుదొడ్ల పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు 10వ తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. బడిబాటలో హెచ్‌ఎంలతో పాటు ఉపాధ్యాయులు గ్రామాల్లో తిరిగి, బడిబయట పిల్లలను గుర్తించి, పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ఇందులో హెచ్‌ఎం జగదీష్, ఉపాధ్యాయులు ఉన్నారు.

సర్కారు బడుల్లో చేర్పించండి



ర్యాలీ తీస్తున్న ఉపాధ్యాయులు

కొడంగల్: బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాధికారి రాంరెడ్డి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయబృందం ఎంపీడీఓ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు, విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. తల్లిదండ్రులు వారి పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని ఆయన కోరారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, డీడీఎస్ అధ్యక్షుడు జయతీర్థచారి, మెప్మా, ఐకేపీ, ఎమ్మార్సీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బంట్వారం: బార్వాద్‌లో..



దౌల్తాబాద్: తిమ్మారెడ్డిపల్లిలో..



దుద్యాల్: కుదురుమల్ల పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు



బొంరాస్‌పేట: పూర్యానాయక్‌తండాలో..

ఆగిన బాల్య వివాహం

వివరాలు తెలపాలంటూ న్యాయమూర్తి ఆదేశం

ధారూరు: మండల కేంద్రంలోని ఓ ప్రార్థనాలయంలో జరుగుతున్న బాల్య వివాహాన్ని పోలీసులు, అధికారులు నిలిపివేశారు. ఈ ఘటనపై పత్రికల్లో రావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్మన్ డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి గురువారం స్పందించారు. ఈ నెల 2న కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాకు చెందిన ఓ 15 ఏళ్ల బాలికను, వారి బంధువుల యువకుడు(23)కు ఇచ్చి వివాహం చేస్తుండగా పోలీసులు, చైల్డ్‌లైన్ సిబ్బంది, అధికారులు అడ్డుకున్నారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. ఈ విషయంపై పూర్తి వివరాలు ఇవ్వాలని న్యాయమూర్తి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మహిళా శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారిని ఆదేశించారు.

రవాణా సౌకర్యం మెరుగుపర్చండి..

ధారూరు: కొరవడిన రవాణా సౌకర్యంతో మండల ప్రజల తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని కాంగ్రెస్ నాయకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమీప మండలాలు, గ్రామాల నుంచి ధారూరు మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సులు సరిగా లేకపోవడంతో మండలకేంద్రం క్రమంగా ఉనికి కోల్పోతోందని, తద్వారా స్థానికంగా వాణిజ్యం దెబ్బతింటోందని తెలిపారు. మండల పరిధి రాజాపూర్, మోమిన్‌కలాన్, నాగారం, తరిగోపుల, మైలారం, ధర్మాపూర్, కొండాపూర్‌కలాన్, నర్సాపూర్, గడ్డమీది గంగారం, మున్నూరుసోమారం, కాచారం, చింతకుంట, హరిదాస్‌పల్లి, గురుదోట్ల, అంపల్లి, పీసీ ఎంతండా, కుమ్మర్‌నపల్లి, జీడిగడ్డతండా తదితర గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావడానికి ఇబ్బంది పడుతున్నారని వెల్లడించారు. అదే విధంగా సమీప మండలాలు కొడంగల్, బొంరాస్‌పేట, పరిగి నుంచి మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సులు లేవన్నారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు, రైతులు మండల కేంద్రం ధారూరుకు వెళ్లకుండా.. పరిగి, వికారాబాద్, తాండూరు ప్రాంతాలకు వెళ్లి, తమకు కావాల్సిన సరుకులు, ఇతర సామగ్రిని కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. దీంతో ఇక్కడి వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజల రవాణా అసౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు మండల కేంద్రానికి ఉన్న అన్ని మార్గాల్లో బస్సులు తిప్పేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నిర్మించారు.. వదిలేశారు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం

మోమిన్‌పేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కొత్తగా నిర్మించిన భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదని, శిథిలావస్థలో ఉన్న భవనంలో విధులు నిర్వహించాలంటే భయంగా ఉందని వైద్య సిబ్బంది భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. మండల కేంద్రంలో రూ.1.56కోట్లతో 2022లో పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు చేపట్టారు. నిర్మాణం పూర్తయి ఆరు నెలలు గడుస్తున్నా.. వినియోగంలోకి తీసుకురావడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అసలే వర్షాకాలం, వానలు ఎక్కువగా పడితే.. పీహెచ్‌సీ కేంద్రంగా కొనసాగుతున్న భవనం కూలిపోయే ప్రమాదం ఉందని వాపోయారు. ప్రమాదాన్ని గుర్తించి, వెంటనే నూతన భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. నీటి సౌకర్యం కల్పించకుండానే భవనాన్ని నిర్మించారని, త్వరగా బోరుబావిని తవ్వి, ఆస్పత్రిని ప్రారంభించాలని సూచించారు.

సొంత భవనాలు కరువు

- చెట్లకింద, సభ్యుల నివాసాల్లో కార్యక్రమాలు
- ఇబ్బంది పడుతున్న పొదుపు సంఘాల ప్రతినిధులు



సభ్యురాలి ఇంటి ఆవరణలో సభ్యుల సమావేశం(ఫైల్)

దౌల్తాబాద్: మహిళా పొదుపు సంఘాలకు సొంత భవనాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామైక్య సంఘాలకు భవనాలు నిర్మించాలని సభ్యులు కోరుతున్నా.. వాటి ఊసేలేదు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాలు కొనసాగుతుండగా.. సమావేశాల నిర్వహణకు సరైన వేదిక లేకపోవడంతో.. చెట్ల కింద, సంఘం సభ్యుల నివాసాల్లో సమాలోచనలు చేస్తున్నారు. మండల పరిధి 33 గ్రామపంచాయతీల్లో 46 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. ఇందులో సుమారు 806 స్వయం సహాయక సంఘాలు ఉండగా.. 8,300 మంది సభ్యులు ఉన్నారు. స్వయం ఉపాధి కార్యక్రమాల ద్వారా.. మహిళలు జీవనోపాధి పొందుతూనే.. పొదుపులో ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రధానంగా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల మంజూరు, వసూలు, సభ్యుల్లో చైతన్యం పెంపొందించడంలో కీలకపాత్ర పోషించే సంఘాలకు సొంత భవనం లేదు. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.

వెంటాడుతున్న సమస్యలు..

సొంత భవనాలు లేక సంఘాల కార్యక్రమాల నిర్వహణతో పాటు మహిళా సమాక్యలు, మహిళా పొదుపు సంఘాల సమావేశాల నిర్వహణ, శిక్షణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గ్రామైక్య సంఘాల వద్దకు వివిధ పనుల కోసం రాకపోకలు సాగించే మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులకు గ్రామాల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లోని సంఘాల నిర్వహణకు మండల కేంద్రంలో ఇందిరాక్రాంతి పథం పేరిట సొంత భవనం ఏర్పాటు చేసినప్పటికీ.. స్థానికంగా నిర్మిస్తే సంఘాల సమస్యలు తీరనున్నాయి.

నివేదించాం..

స్వయం సహాయక సంఘాల నిర్వహణ కోసం సొంత భవనాల నిర్మాణాల విషయమై ఉన్నతాధికాలకు వివరించాము. మండలంలో భవనాలు కావాలని ప్రతిపాదనలు పంపించాము. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అయితే నిర్మాణాలు చేపడతాం.

– సాయన్న, ఏపీఎం, దౌల్తాబాద్

విద్యార్థినికి సన్మానం

షాద్‌నగర్: పట్టణంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన బీజేపీ నేత మల్చలం మురళీ కూతురు లక్ష్మిప్రియ ఆల్ ఇండియా నీట్‌లో 6650 ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్యలు విద్యార్థిని సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు ప్యాట అశోక్, వంశీకృష్ణ, విజయ్‌కుమార్, సుబ్రహ్మణ్యం, కిషోర్‌రెడ్డి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు 'అనంత' ప్రథమ వార్షికోత్సవం

తాండూరు టౌన్: అనంత సాహిత్య, సాంస్కృతిక వేదిక ప్రథమ వార్షికోత్సవ వేడుకలు పట్టణంలోని తులసి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కోటం చంద్రశేఖర్, కరణం మాణిక్‌రావు, వడిచర్ల సత్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ శతావధాని డాక్టర్ మలుగ అంజయ్య, ప్రముఖ రంగస్థల నటుడు మాలెల అంజిలయ్యలకు జీవన సాఫల్య పురస్కారాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. 81 మంది కవులు రచించిన కవితలతో రూపొందించిన 'అనంత' సంకలనం, కవి దోరవేటి రచించిన 'ప్రకృతి పరిమళం' అనే గ్రంథాలను ఇదే వేదికపై ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కొనసాగనున్న వేడుకల్లో ఆశుకవితా లహరి, ఏకపాత్రాభినయం, చిత్రకళా ప్రదర్శన, నృత్య, పుస్తక ప్రదర్శన ఉంటుందన్నారు. వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి, విశిష్ట అతిథులుగా పూర్వాచార్యులు బాగయ్య, చంద్రప్రకాష్ రెడ్డి, నర్సింగరావు, మల్లారెడ్డి తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు.

రేపు లోక్ అదాలత్

దౌల్తాబాద్: ఈ నెల 8న కొడంగల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఎస్ఐ శ్రీశైలం యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టు కేసుల్లో రాజీపడాలనుకునేవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. రోడ్డు ప్రమాదాలు, తగాదాలు, మోసం, భూ తగాదాలు తదితర కేసుల్లో రాజీపడాల్సిన ఇరువర్గాలు కోర్టుకు రావాలని సూచించారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

దోమ: భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పురుషోత్తం తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రెవెన్యూ సిబ్బందితో ధరణి సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడారు. భూ సమస్యల విషయంలో రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోకుండా వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

రేణుక ఎల్లమ్మ రథోత్సవం నేడు

తాండూరు రూరల్: మండల పరిధి కోత్లాపూర్ శివారు శ్రీ రేణుక ఎల్లమ్మ జాతరలో భాగంగా శుక్రవారం రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శేఖర్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం గ్రామం నుంచి ఆలయం వరకు అమ్మవారి విగ్రహం ఊరేగింపు, అనంతరం రథోత్సవం చేపట్టనున్నట్లు తెలిపారు.

క్రీడా మైదానంలో మురుగు

అసౌకర్యానికి గురవుతున్న క్రీడాకారులు



మైదానంలో పేరుకుపోయిన మురుగు నీరు

కుల్కచర్ల: క్రీడాకారులను ప్రోత్సహిస్తామని పాలకులు, అధికారులు చెబుతున్నా.. వాస్తవ రూపంలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. మైదానాలైతే ఏర్పాటు చేశారు కానీ.. వాటి పర్యవేక్షణ మరిచారని క్రీడాకారులు ఆరోపిస్తున్నారు. అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్నట్లుగా.. మైదానం ఉన్నా.. వినియోగానికి అసౌకర్యంగా ఉందని, ఆటలు ఆడలేక పోతున్నామని వాపోతున్నారు. మండల పరిధి ఇప్పాయిపల్లి మైదానంలో యువత వాలీబాల్, క్రికెట్ తదితర ఆటలను ఆడుతుంటారు. ఈ క్రమంలో గ్రామంలోని మురుగు జలాలు పూర్తిగా గ్రౌండ్‌లోకి వస్తున్నాయి. వ్యర్థ జలాలు ముందుకు పారేందుకు సరైన మార్గం లేకపోవడంతో మైదానంలో నిలిచి, మడుగును తలపిస్తోంది. దీంతో క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆరోపించారు. ఇదే విషయమై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. సమస్య తమ దృష్టికి వచ్చిందని, పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈటల, కొండాను కలిసిన నాయకులు



విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసిన మండల నాయకులు

చేవెళ్ల: ఎంపీలుగా గెలిచిన బీజేపీ నాయకులు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలను ఆ పార్టీ చేవెళ్ల నాయకులు వేర్వేరుగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం వారి నివాసాలకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మల్కాజ్‌గిరి ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలుపొందిన ఈటలను నాయకులు ఆంజనేయులుగౌడ్, దేవుని శర్వలింగం, శ్రీనివాస్, యాదగిరి, రాంచందర్, శంకరచారి, జైపాల్‌గౌడ్, హనుమంతు తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని మండల నాయకులందరూ కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చేవెళ్ల ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారన్నారు. పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలను అభినందించారు. చేవెళ్ల ప్రజలకు, నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని చెప్పారన్నారు. ఆయనను కలిసిన వారిలో చేవెళ్ల మండల నాయకులు, కార్యకర్తలు ఎం.వైభవ్‌రెడ్డి, అశోక్, ఇంద్రాసేనారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మచ్చందర్‌రెడ్డి, జయసింహ్మారెడ్డి ఉన్నారు.

అద్దె ఎడ్లతో అరక

కిరాయి భారంతో రైతులు సతమతం

పెద్దేముల్: వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతన్నలు పొలం పనుల్లో బిజీగా ఉన్నారు. దుక్కులు దున్నడం, విత్తనాలు విత్తడం అందరూ ఒకే సారి మొదలు పెట్టడంతో అరకలకు డిమాండ్ ఏర్పడింది. అద్దెలు పెంచడంతో రైతులకు భారంగా మారింది. పొలం పనులు ఎక్కువగా ట్రాక్టర్ల ద్వారానే అవుతున్నప్పటికీ.. విత్తులు విత్తే సమయంలో కాడెడ్లు అద్దెకు దొరకక అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో అరకకు రూ.1000 ఉండగా.. ప్రస్తుతం అది రూ.1200 నుంచి రూ.1500, రూ.1800ల వరకు పలుకుతోంది. అయినా సమయానికి అద్దెకు దొరకడం లేదని రైతులు తెలిపారు. ముఖ్యంగా మండల పరిధిలో కంది, పత్తి పంటలు అధికంగా సాగు చేస్తున్నప్పటికీ.. వ్యవసాయ పనులకు కూలీలు కరువయ్యారని పేర్కొంటున్నారు. ప్రభుత్వం ట్రాక్టర్ల ద్వారా విత్తనాలు విత్తే యంత్రాలను రాయితీ ద్వారా అందజేయాలని రైతులు కోరుతున్నారు.



అరకతో విత్తనాలు వేస్తున్న రైతులు